క్లుప్తంగా

ఓటరు నమోదు పరిశీలన



కొత్తకోటలో ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఆదివారం జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. కొత్తకోటలో బీఎల్వోలు చేపట్టిన ఓటరు నమోదునుడీటీ పురుషోత్తంతో కలిసి తనిఖీ చేసిన తహసీల్దార్ ప్రక్రియ వివరాలపై ఆరా తీశారు. కొత్తగా ఓటు హక్కు కోసం 14 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 18వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ముట్టడికి నగరంలోని అన్ని వార్డుల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. ఆదివారం సీపీఐ సదాశివ నగర్ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్ర బాబునాయుడు ఎన్నికల ముందు ఇల్లు లేని పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇస్తానని వాగ్దానం చేసి ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదల గోడును ఆయనకు గుర్తు చేసేందుకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్వర్, షాకీర్, బాషా, రెహమాన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కర్నూలు (టౌన్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తిపై ఆదివారం మూడవ పట్టణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఇటీవల ఆసుపత్రిలో ఎలుకల బెడద అంటూ పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలు రాయించడంలో అక్కడ పనిచేసే పెస్టిసైడ్ సూపర్‌వైజర్ మల్లికార్జున పాత్ర ఉందని అతనితో హెల్త్ ఇన్‌స్పెక్టర్ వాగ్వివాదానికి దిగాడు. కులం పేరుతో దూషించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

టీడీపీతో యాదవులకు తీవ్ర అన్యాయం

కర్నూలు న్యూసిటీ: నామినేటెడ్ పదవులు కేటాయించడంలో తెలుగుదేశం ప్రభుత్వం యాదవులకు తీవ్ర అన్యాయం చేసిందని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యాదవ సంఘ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి యాదవులు ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో బీసీలలో అధిక శాతంగా ఉన్న యాదవులకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు, నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో టీడీపీ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం యాదవులకు ప్రాధాన్యత కల్పిస్తూ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్విమ్మింగ్‌లో స్టాఫ్‌నర్సు పతకాల పంట

కర్నూలు(హాస్పిటల్): రాజమండ్రిలో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్-2024 పోటీలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న డి.మంజులాదేవి బంగారు పతకాలు సాధించారు. ఆమె వంద మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో 3 బంగారు, ఒక వెండి పతకం సాధించారు. రాష్ట్రంలో ఓ స్టాఫ్‌నర్సు స్పోర్ట్స్ ఈవెంట్‌లో పాల్గొని పతకాలు సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అదేవిధంగా అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

షూటింగ్‌బాల్ విజేత పల్నాడు జట్టు

కర్నూలు (టౌన్): గత రెండు రోజులుగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల షూటింగ్‌బాల్ పోటీల్లో విజేతగా పల్నాడు జిల్లా జట్టు నిలిచింది. అలాగే ఎన్టీఆర్ జిల్లా (ద్వితీయ స్థానం), అన్నమయ్య జిల్లా (తృతీయ స్థానం)లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు ఆదివారం సాయంత్రం గుడ్ షప్పర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ యేసుదాసు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, అతిథిగా హాజరైన కళ్ల నాగవేణి రెడ్డి కప్పు, మెడల్స్ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు వచ్చేస్తున్నాయ్!

- ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రారంభం
- విడతలవారీగా పూర్తిస్థాయిలో అమర్చేందుకు రూపకల్పన
- ముందస్తు చెల్లింపులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పేదలు

గడివేముల: సాంకేతికత అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. విద్యుత్ శాఖ మాన్యువల్ మీటర్లకు స్వస్తి చెప్పనుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. కార్యాలయాలు, వ్యాపారాల సముదాయాలు, పారిశ్రామలతోపాటు గృహాలకు స్మార్ట్ మీటర్లు (ప్రీపెయిడ్ మీటర్లు) ఏర్పాటు చేయనున్నారు. కొన్ని నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికాయంత్రాంగా ప్రణాళికలు రూపొందించింది. అయితే వినయోగదారులు ముందస్తుగా స్మార్ట్ మీటర్లకు రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ అవసరాలకు ముందుగానే రొక్కం చెల్లించేలా నూతన విధానం అమల్లోకి రానుంది. ఈ ప్రక్రియపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గడివేముల మండలంలో దాదాపు 11719 వేలకుపైగా వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 137 దాకా స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో అమర్చినట్లు సమాచారం. అయితే ఈ మీటర్లకు ఎటువంటి సిమ్‌కార్డు అమర్చలేదు. దశలవారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. అయితే ముందస్తు చెల్లింపులపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ నెల వినియోగించిన కరెంటు బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు అమర్చితే ఈ పరిస్థితి ఉండదు. ముందుగానే సొమ్ము చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో కొంతమేర పేదలకు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పేదలకు ఇబ్బందులే...

కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ కమర్షియల్ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల అమరిక ప్రక్రియ ప్రారంభమైంది. వీలైనంత త్వరగా అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలనే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. అయితే కొందరు ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారు. ఎందుకంటే విద్యుత్ వినయోగానికి ముందస్తుగా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే కరెంట్‌చార్జ్ ముందుగానే చెల్లించాలన్న మాట. అంటే మన సెల్‌ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఏ విధంగా రీచార్జ్ చేసుకుని వాడుతున్నామో అదే విధానం అమలు కానుంది. విద్యుత్ మీటర్‌కు సంబంధించి రీచార్జ్ నగదు మేరకు సరఫరా కొనసాగనుంది. రీచార్జ్ అయిపోతే మళ్లీ చేయించుకోవాల్సిందే. దీంతో ప్రజలు రకరకాలకు ఆలోచిస్తున్నారు. పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



గడివేములలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ మీటర్

దశలవారీగా ఏర్పాటు చేస్తాం

ఉన్నతాధికారుల ఆదేల మేరకు అన్నికార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. గడివేముల మండలంలో ఇప్పటి వరకు 137 మీటర్లుఏర్పాటు చేశాం. క్యాటగిరి-2 మీటర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. దశల వారీగా గృహ, వ్యాపార, పారిశ్రామిక సర్వీసులకూ అమలు చేయనున్నాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన సరఫరాను వినియోగదారులు పొందవచ్చు.
–రాకేష్‌గౌడ్,ఇన్‌చార్జ్ ఏఈ,గడివేముల

రాత్రి సమయంలో రీచార్జ్ అయిపోతే ఎలా?



ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవేళ రాత్రి సమయంలో రీచార్జీ అయిపోతే కరెంట్ కట్ అయిపోతుంది. నాకు రీచార్జ్ చేయడం కూడా తెలియదు. రాత్రంతా చీకటిలో ఉండాల్సిందేనా. ప్రభుత్వం స్పందించి మాలాంటి వారికి ఉన్న మీటర్లనే ఉంచాలి.
– పంటా గోపాల్ రెడ్డి, బూజునూరు

గ్రామీణులకు ఇబ్బందులు



గ్రామీణ ప్రాంతాల్లో ఈస్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవు. పట్టణంలో ఉన్నవారికి ఇది మంచిదే. గ్రామీణ ప్రాంతాల్లో రీచార్జ్ అయిపోతే పరిస్థితి ఏంటి. అంధకారంలో ఉండాల్సిందేనా. రీచార్జి చేయాలంటే సెల్‌ఫోన్ దుకాణానికి వెళ్లాలి. అదే పట్టణంలో అలాంటి పరిస్థితి ఉండదు.
–యాసిన్ బాషా, గడివేముల

ప్రజలకు అవగాహన కల్పించాలి



గ్రామాల్లో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తే మంచిది. ఆ దిశగా విద్యుత్ శాఖ అధికారులు ముందుకు సాగాలి. స్మార్ట్ మీటర్ల వలన ఉపయోగాలను విద్యుత్ అధికారులు తెలియజేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుతో భయపడుతున్నారు.
–జయన్న, గడివేముల

2,264 క్యూసెక్కులు విడుదల

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల (కోట్ల విజయభాస్కర్ రెడ్డి) బ్యారేజీకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం నదిలో 4,720 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, బ్యారేజీ ఒక గేటు పైకెత్తి 2264 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2,445 క్యుసెక్కుల నీటిని వదులుతున్నారు.

కేసీ కాల్వలో యువకుడి గల్లంతు

కర్నూలు (టౌన్): ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం స్వామిరెడ్డినగర్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ఫొటోగ్రాఫర్ అంజనేయులు కుమారుడు దినేష్ మధ్యాహ్నం కేసీ కెనాల్ వైపు నడుచుకుంటూ వెళ్తూ పొరపాటున కాల్వలో పడ్డారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వైద్య శిబిరానికి స్పందన

కర్నూలు న్యూసిటీ: కర్నూలు నగరంలోని 6వ వార్డు బేకారి కట్ట వద్ద మెడికవర్, శాంతిరామ్ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. క్యాంపులో 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకులు స్వచ్ఛంద సంస్థల నాయకులు టి.మద్దిలేటి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

జీఓ117 వెంటనే రద్దు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు

కోడుమూరు రూరల్ : విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓనం117 రద్దుకు వెంటనే చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గూడూరులో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు రెండవరోజు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. వెంటనే పీఆర్‌సీని ప్రకటించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఈ చర్యలను ఆపకపోతే ఉద్యమ బాట పట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం సభకు ముఖ్య అతిథులుగా హాజరైన గూడూరు మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైఎస్ చైర్మన్ పీఎస్ అస్లామ్‌లను యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, హేమంత్‌కుమార్, దావీద్, యెహోషువ తదితరులు పాల్గొన్నారు.

కూటమి హామీలను తక్షణమే అమలు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ



కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలను నిరసిస్తూ సీపీఎం చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఆదివారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో నాయకులు నిర్వహించారు. ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న మోసపూరిత తీరును నాయకులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ మాట్లాడారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, విద్యుత్ చార్జీల పెరుగుదల, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పథకాల పేర్లు మార్చడం తప్పా కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు ప్రతిఒక్కరూ తరలివచ్చి విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సీఐటీయు మండల కార్యదర్శి షాజాహాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామస్వామి, మాలిక్ బాష, సభ్యులు మాసూం బాష, దస్తగిరి, బుజ్జన్న, సిద్దయ్య, వెంకటేశ్వర్లు, జగన్నాథం, స్వాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కోడుమూరు రూరల్ : కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఎం, సీఐటీయూ నాయకులు కోడుమూరులో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ మోసాలను వివరించారు. వీరన్న మాట్లాడుతూ కూటమి నేతలు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు, చదువుకునే పిల్లలందరికీ రూ.15వేలు, 18సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1,500 తదితర హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి పెద్దలు వాటి అమలులో నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు బుడ్డప్ప, గంగాధర్, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గకు చరణానందస్వామి రాక

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామి సన్నిదానంలోని మాతా పూర్ణానందగిరి ఆశ్రమానికి సోమవారం శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామి రానున్నట్లు ఆశ్రమ కమిటీ నిర్వాహకులు చల్లా మాధవకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీయజ్ఞ వల్క రాజాశ్రమం పీఠాధిపతి పూర్ణానంద... ప్రభోద ఆశ్రమ పీఠాధిపతిగా పట్టాభిషేక కార్యక్రమానికి శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వాములు హాజరవుతున్నారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో పాటు మరో ఏడు మంది పీఠాధిపతులు హాజరవుతున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.

రేడియాలజి సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగర శివారులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రేడియాలజీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు జోనల్ సీఎంఈ (నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు) నిర్వహించారు. సదస్సుకు రాయలసీమలోని వివిధ మెడికల్ కాలేజీల నుంచి రేడియాలజి పీజీ వైద్య విద్యార్థులు 300 మందికి పైగా హాజరయ్యారు. వారికి వివిధ రేడియాలజి వైద్య గురువులు బోధించారు. రేడియాలజి పీజీ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ మునిరుద్దీన్ అహ్మద్‌ను ఏపీ ఎంసీ అబ్జర్వర్ డాక్టర్ కృష్ణనాయక్, రేడియాలజి ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ అబ్దుల్ గఫూర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి సన్మానించారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగం ఉంచాలి



మాట్లాడుతున్న గురుదాస్

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్‌లో రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో జరిగిన డీపీహెచ్‌ఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యంత దృఢమైనదని, అలాంటి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి బీజేపీ కుటిల ప్రయత్నాలు చేస్తోందన్నారు. అనేకసార్లు రాజ్యాంగాన్ని సవరించుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని కార్పొరేటర్లకు తాకట్టు పెట్టి వారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. డిసెంబర్ 5వ తేదీన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఎస్.మునెప్ప, కుమార్‌రాజా పాల్గొన్నారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి కార్తీక మాసం రెండవ ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామం కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి క్యూకట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు నాలుగు గంటలు పట్టినట్లు భక్తులు తెలిపారు. తెల్లవారుజామునే మహిళలు ఆలయ ప్రాంగనంలో కార్తీక దీపాలు వెలిగించారు. శివనామస్మరణం మారుమోగింది. శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామివారి నంద్యాల జిల్లా ఏఎస్పీ యుగంధర్‌బాబు దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈఓ రామక్రిష్ణ ఆధ్వర్యంలో డీఎస్పీకి అర్చకులు శేషావస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

కిటకిటలాడిని కొత్తూరు

కార్తీక మాసం రెండవ ఆదివారం శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో కొత్తూరు గ్రామం కిటకిటలాడింది. నందివర్గం, తొగర్చేడు, మద్దూరు గ్రామాల మీదుగా కొత్తూరు చేరుకోనే రోడ్డు మొత్తం వాహనాలతో నిండిపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారిని దాదాపు 15వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో అఖండ భజన



అఖండ భజనలో పాల్గొన్న భక్తులు



పూజ చేస్తున్న భక్తులు

కల్లూరు: కర్నూలు నగరంలోని సత్య సాయి మందిరంలో భక్తులు అఖండ భజన నిర్వహించారు. శనివారం సాయంత్రం ప్రారంభమై అఖండ భజన ఆదివారం సాయంత్రం మహామంగళ హారతితో ముగిసింది.

సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు

తెలంగాణ రాష్ట్రం వరంగల్ నుంచి శబరిమలకు కాలినడకన వెళ్తున్న అయ్యప్ప భక్తులు ఆదివారం కర్నూలు నగరంలోని సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని పడిపూజ మహోత్సం నిర్వహించారు. సుమారు 350 మంది అయ్యప్ప భక్తులు స్వామివారికి అభిషేకం, పడిపూజ చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మండల పరిధిలోని దూపాడు గ్రామంలో త్రైత సిద్ధాత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవగద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు సభ్యులు వివరించారు. కార్యక్రమంలో కల్లూరు కమిటీ సభ్యులు పురుషోత్తం, ఓబులేసు, ఈశ్వరయ్య, లత, సునీత, మౌనిక, మహేశ్వరి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కోడుమూరు రూరల్ : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలతోపాటు గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఇళ్ల స్థలాలు, గృహాలకు సంబంధించిన అర్జీల కరపత్రాలను నాయకులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఈనెల 18న గ్రామ సచివాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, స్థానిక నాయకులు మునిస్వామి, సుంకన్న, దాము, చిన్న రాముడు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మన చేతుల్లోనే ఆరోగ్యం

కర్నూలు కల్చరల్: మనిషికి సంపూర్ణ ఆరోగ్యం ఎంతో అవసరమని, ఇది మన చేతుల్లోనే ఉందని కర్నూలు వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుజ్జల భవానీప్రసాద్ అన్నారు. సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం ఆయుష్మాన్ భవ కార్యక్రమం జరిగింది. గాడిచెర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. 'వయోవృద్ధులకు ఆరోగ్య సూత్రాలు' అనే అంశంపై డాక్టర్ భవానీ ప్రసాద్ ప్రసంగించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం చేయాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. 'ఐరోపా దేశాల యాత్ర అనుభవాలు' అనే అంశంపై సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లెపోగు నాగరాజు మాట్లాడారు. తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జే.ఎస్‌ఆర్కే శర్మ మాట్లాడారు. డాక్టర్ పార్వతీ దేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. నరసం అధ్యక్షులు కావెం సుబ్బలక్ష్మమ్మ, కవులు, రచయితలు పాల్గొన్నారు.



వక్తలను సన్మానిస్తున్న నిర్వాహకులు

విద్యార్థి అదృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న కె. వెంకటకుమార్‌రెడ్డి అదృశ్యమైనట్లు విద్యార్థి తల్లి సుజాత ఆదివారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సుజాత, వెంకటేశ్వరరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు వెంకటకుమార్‌రెడ్డి పాఠశాల నుంచి కనిపించకుండా పోయాడన్నారు. ఆదివారం పాఠశాలలో అవుటింగ్ ఉన్నందున తన ఇద్దరు కుమారులతో మాట్లాడి భోజనం చేశామన్నారు. భోజనం అనంతరం వెంకటకుమార్‌రెడ్డి పాఠశాల ఆవరణలో కనిపించలేదన్నారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీసీ కెమెరాలు సరిగ్గా పని చేయడంలేదని ప్రిన్సిపాల్ చెప్పడంతో పాణ్యం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ విషయంపై ఎంఈఓ కోటయ్య దృష్టికి తీసుకెళ్లగా పూర్తి స్థాయి విచారణ చేపడతామన్నారు.

లూసిడా క్యాలిగ్రఫీపై వర్క్‌షాపు

కర్నూలు సిటీ: విద్యార్థుల చేతి రాతను మార్చే అంశంపై లూసిడా క్యాలిగ్రఫీ వర్క్‌షాపు ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో టౌన్ మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ వర్క్‌షాపులో డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల చేతి రాతను మార్చేందుకు ఇలాంటి వర్క్‌షాపు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. అక్షరాలు చక్కగా ఉంటే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని చెప్పారు. వర్క్‌షాపులో గుంటూరు నుంచి క్లబ్ తరపున శ్రీరామ్ రామ్మోహన్, నిర్వాహకులు సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య

కర్నూలు కల్చరల్: హేతువాద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన జేవీ కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఒంగోలులో జరిగిన హేతువాద సంఘం మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా విష్ణుమూర్తి, బాలచందర్, సంయుక్త కార్యదర్శులుగా సత్యనారాయణ, సత్తెన్న, ఈసీ మెంబర్స్‌గా లక్ష్మీ ప్రియదేవి, రామశేషయ్య, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు కృష్ణయ్య తెలిపారు.